## తానా చైతన్య భారతి




హైదరాబాద్ : 'చైతన్య భారతి - 2008' పేరిట ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) డిసెంబర్ 27న రవీంద్ర భారతిలో పలు కార్యక్రమాలు నిర్వహించింది. ఆ రోజంతా నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రసిద్ధ కవులు, పండితులు, రాజకీయవేత్తలు, సినిమా నటులు తదితరులు పాల్గొన్నారు. తానా నిర్వహిస్తున్న ద్వైవార్షిక సమావేశాలకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వికలాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు వారికి ఆటల పోటీలు నిర్వహించింది. తెలుగు భాషకు ప్రాచీన హోదాపై చర్చ, తానా అవార్డుల ప్రదానం తదితర కార్యక్రమాలను ఈ కార్యక్రమంలో నిర్వహించింది.

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ గార్డెన్‌లో 'అసాధారణ ప్రజ్ఞా పాటవాలు' గల వ్యక్తుల (శారీరక, మానసిక వికలాంగులాంగులు)కు డిసెంబర్ 27 శనివారం ఉదయం క్రీడల పోటీలు నిర్వహించింది. పోటీలకు సినీ నటుడు, ప్రజారాజ్యం పార్టీ యువజన విభాగం 'యువరాజ్యం' అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వికలాంగుల్లో ఉత్తేజాన్ని కలిగించే విధంగా ఇంత చక్కని కార్యక్రమాన్ని రూపొందించిన తానా సభ్యులను పవన్ కల్యాణ్ అభినందించారు. రాష్ట్రంలో నలు దిక్కుల నుంచి ఈ పోటీలకు విశేష సంఖ్యలో వికలాంగులు హాజరై పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జెండాలు, బెలూన్లతో అలంకరించిన ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన ఆటల పోటీల్లో 16 జట్లుగా 500 మందికి పైబడి చిన్నారులు పాల్గొన్నారు. ఈ పోటీలకు 50 మంది కోచ్‌లు కూడా హాజరయ్యారు. ఉత్సాహపూరిత వాతావరణంలో ఈ పోటీలను నిర్వహించినట్లు తానా తాత్కాలిక అధ్యక్షుడు జయరాం కోమటి, కార్యదర్శి ప్రసాద్ తోటకూర, మాజీ అధ్యక్షుడు గంగాధర్ నాదెళ్ళ, భారతదేశంలో తానా కార్యక్రమాల సమన్వయకర్త దాము గేదల తెలిపారు. సాయంత్రం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు, మెమెంటోలను ప్రదానం చేశారు.